ఎపిఆర్‌ఒగా సత్యనారాయ రాజు బాధ్యతల స్వీకరణ

భీమవరం: సహాయ పౌర సంబంధాల అధికారిగా కెటిఎంకె ఎన్.సత్యనారాయణ రాజు బాధ్యతలు స్వీకరించారు. భీమవరం డిపిఆర్‌ఒ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ రాజుకు ఎపిఆర్‌ఒగా(సహాయ పౌర సంబంధాల అధికారి) ఉద్యోగోన్నతి కల్పిస్తూ సమాచార పౌర సంబంధాల శాఖ విజయవాడ ప్రాంతీయ సంయుక్త సంచాలకులు ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు జిల్లా భీమవరం సమాచార శాఖ కార్యాలయంలో శనివారం ఉదయం సత్యనారాయణ రాజు ఎపిఆర్‌ఒగా బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా డిపిఆర్‌ఒ టి.నాగేశ్వరరావు, పబ్లిసిటీ అసిస్టెంట్ సిహెచ్.శ్రీనివాస్ నెహ్రూ, టైపిస్ట్ కె.జ్యోతి, జూనియర్ అసిస్టెంట్ పి.రవితేజ, రికార్డ్ అసిస్టెంట్ డి.సోమరాజు, ఫొటోగ్రాఫర్ పివై.రత్నాకర్, సిబ్బంది పి.వీరభద్రం, జె.రాజేష్ బాబు, రెడ్డి వైశాలి, అభినందనలు తెలిపారు.

సాగు సాయం నిల్..!

మోడీ ప్రభుత్వం 2025 - 26 బడ్జెట్‌లో రైతులకు మొండిచేయు చూపించింది. శనివారం పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన వార్షిక బడ్జెట్‌లో వ్యవసాయానికి సంబంధించిన కీలక అంశాలపై కనీస ప్రస్తావన లేకుండా పోయింది. పండించిన పంటలకు మద్దతు ధరల గ్యారెంటీ చట్టంపై నోరు విప్పలేదు. పెద్ద ఎత్తున విదేశీ మారక ద్రవ్యం సమకూరుస్తున్న ఆక్వా సాగు ప్రస్తావన లేకుండా పోయింది. పోలవరానికి నిధులు కేటాయింపు కొంతమేర చూపించినా, రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులపై స్పష్టత లేని పరిస్థితి నెలకొంది. వేతన జీవులకు పన్ను మినహాయింపులో మాత్రం ఊరట లభించిన పరిస్థితి నెలకొంది.

- కేంద్ర బడ్జెట్‌లో రైతులకు మోడీ సర్కార్ దగా
- మద్దతు ధర గ్యారెంటీ చట్టం ఊసే కరువు
- ఆక్వారైతులకు దక్కని భరోసా
- 'పోలవరం'కు రూ. 5,936 కోట్లు కేటాయింపు
- రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులపై స్పష్టత కరువు
- వేతన జీవులకు రూ.12 లక్షల వరకూ పన్ను మినహాయింపు

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

కేంద్ర బడ్జెట్‌పై ఆశలు పెట్టుకున్న జిల్లా రైతాంగానికి నిరాశే మిగిలింది. వ్యవసాయానికి సాయం చేసే విధంగా బడ్జెట్‌లో కేటాయింపులు లేకుండా పోయాయి. జిల్లాలో 80 శాతానికిపైగా ప్రజలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయంపై తీసుకునే ప్రతి నిర్ణయంపైనా ఇక్కడి రైతులపై ప్రభావం చూపుతోంది. రైతులు ఆరుగాలం కష్టపడి పంటలు పండిస్తున్నా మిగులు అనేది లేకుండా పోతోంది. జిల్లాలో ప్రధానంగా వరి, మొక్కజొన్న, పామాయిల్ వంటి పంటలతోపాటు, మామిడి, పత్తి, చెరకు వంటి అనేక పంటలను రైతులు సాగుచేస్తున్నారు. వ్యవసాయ ఖర్చులు విపరీతంగా పెరిగిపోవడంతో సాగు సంక్షోభంలో కూరుకుపోయిన పరిస్థితి నెలకొంది. దీంతో మద్దతు ధరల గ్యారెంటీ చట్టం కోసం రైతులు ఎప్పటి నుంచో ఆందోళనలు చేస్తున్నారు. ఢిల్లీ సరిహద్దుల్లో ఏళ్ల తరబడి రైతులు అలుపెరుగని పోరాటం చేస్తున్నారు. ఈ బడ్జెట్‌లో మద్దతు గ్యారెంటీ చట్టంపై ఏదైనా నిర్ణయం ఉంటుందని రైతులు ఆశించారు. మద్దతు ధరల గ్యారెంటీ చట్టం వస్తే వ్యవసాయం పెట్టుబడి ఖర్చులకు అదనంగా 50 శాతం పంటలకు ధర నిర్ణయం ఉంటుంది. ఇది వ్యవసాయ సాగుకు ఎంతగానో ఉపయోగపడుతోంది. మోడీ ప్రభుత్వం బడ్జెట్‌లో ఆ ప్రస్తావనే లేకుండా ముందుకు సాగింది. దీంతో రైతుల్లో తీవ్ర నిరాశ నెలకొంది. ఇటీవల కాలంలో కాంప్లెక్స్ ఎరువుల ధరలు బస్తా రూ.1,400 నుంచి రూ.1,700లకు పైగా చేరింది. ఎరువుల ధరలకు సంబంధించి ఊరట ఇచ్చేలా బడ్జెట్‌లో ఎటువంటి ప్రస్తావన లేని పరిస్థితి నెలకొంది. కౌలు రైతులకు సంబంధించి ఎటువంటి ఊసూ లేకుండా పోయింది. విదేశీ మారక ద్రవ్యం ఆర్జించే ఆక్వా రైతులకు బడ్జెట్‌లో ఎటువంటి ఊరట లభించలేదు. ఆక్వా రైతులకు సంబంధించి ఏమైనా సబ్సిడీలు ఉంటాయని రైతులు భావించారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లో రెండు లక్షల ఎకరాలకు పైగా ఎకరాల్లో ఆక్వా సాగు సాగుతోంది. బడ్జెట్‌లో ఆక్వా ప్రస్తావన లేకపోవడంతో జిల్లా రైతాంగానికి ఎటువంటి మేలు లేకుండా పోయింది.

'పోలవరం'కు రూ.5,936 కోట్లు కేటాయింపు

పోలవరం ప్రాజెక్టుకు బడ్జెట్‌లో రూ.5,936 కోట్లు కేటాయింపులు జరిగాయి. నిర్వాసితులకు పరిహారం కింద రూ.30 వేల కోట్లకు పైగా ఖర్చు అవుతుందని రాష్ట్ర ప్రభుత్వం తెల్పింది. 2027కు పోలవరం ప్రాజెక్టు మొదటి దశ 41.15 మీటర్ల ఎత్తుకు పూర్తిచేసి కాలువలకు నీరు మళ్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం చెబుతోంది. ప్రాజెక్టులో నీరు నిల్వ చేస్తే నిర్వాసిత గ్రామాల్నీ ముంపునకు గురవుతాయి. నిర్వాసిత ప్రజలకు పూర్తిస్థాయిలో పరిహారం అందించి ఖాళీ చేయించాల్సి ఉంది. ప్రస్తుతం కేటాయించిన నిధులు ఏమాత్రమూ సరిపోని పరిస్థితి. ఈ విధంగా నిధులు కేటాయిస్తే నిర్వాసితులకు పరిహారం ఎప్పటికి అందిస్తారో ప్రభుత్వమే చెప్పాల్సి ఉంది.

రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులపై స్పష్టత కరువు..

జిల్లాలోని కొవ్వూరు, భద్రాచలం, నరసాపురం, కోటిపల్లి రైల్వేలైనుకు నిధులు కేటాయింపులకు సంబంధించి స్పష్టత లేకుండా పోయింది. కేటాయింపులు జరిగాయా, పక్కన పెట్టేసారా అనే విషయం స్పష్టత వస్తే జిల్లాకు ఎంతమేర ప్రయోజనం చేకూరుతుందో తెలుస్తోంది.

వేతన జీవులకు ఊరట.. ★★★

ఉద్యోగవర్గాలకు మాత్రం ఈ బడ్జెట్‌లో కొంత ఊరట లభించింది. పన్ను మినహాయింపు రూ.12 లక్షల వరకూ పెంచారు. గతంలో మూడు లక్షల వరకూ నో టాక్స్ ఉండగా ఈ బడ్జెట్‌లో రూ.నాలుగు లక్షలకు పెంచారు. నాలుగు నుంచి ఎనిమిది లక్షలకు రూ. ఐదుశాతం, రూ.8-12 లక్షల వరకూ పదిశాతం, రూ.12 నుంచి రూ.16 లక్షల వరకూ 15 శాతం, రూ.16-20 లక్షల వరకూ 20 శాతం, రూ.20-24 లక్షల వరకూ 25 శాతం, రూ.24 లక్షలు పైన 30 శాతం పన్ను కట్టాల్సి ఉంటుంది.

నెల్లూరులో జరుగుతున్న సిపిఎం 27వ రాష్ట్ర మహాసభకు జిల్లా నుంచి హాజరైన ప్రతినిధులు, మహాసభలో సూపర్ సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని తీర్మానం ప్రవేశ పెడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్, జిల్లా నుంచి చర్చల్లో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, బి.వాసుదేవరావు.

పింఛన్‌ను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టరు నాగరాణి

ప్రజాశక్తి - కాళ్ల

లబ్ధిదారులు పింఛన్ సొమ్మును సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం కోపల్లెలోని ఎస్‌సి కాలనీ, కాళ్లలోని బిసి కాలనీలో పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ చదలవాడ నాగరాణి పాల్గొని పంపిణీ చేశారు. పింఛన్లు పంపిణీ చేసి వారి యోగక్షేమాలు, పిల్లలు ఏం చదువుకుంటున్నారు, ఏ పాఠశాలలో చదువుతున్నారని అడిగి తెలుసుకున్నారు. అక్కడున్న చిన్నారిని కలెక్టరు ఎత్తుకుని ముద్దాడి అంగన్‌వాడీ స్కూల్‌కు పంపిస్తున్నారా అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ నాగరాణి మాట్లాడుతూ జిల్లాలో పెన్షన్లు లబ్ధిదారులకు ఒకటో తేదీనే నూరుశాతం పంపిణీ చేసేందుకు అన్ని చర్యలూ తీసుకున్నామన్నారు. వ్యాధి పీడితులు, వికలాంగుల పట్ల ప్రతి ఒక్కరూ ప్రేమతో మెలగాలన్నారు. పెన్షన్‌దారులు ఇబ్బంది పడకుండా అధికారులు ప్రతి గడపకూ వెళ్లి సొమ్ము అందజేయాలని ఆదేశించారు. జిల్లాలో నూరుశాతం పెన్షన్లు పంపిణీ లక్ష్యంగా అధికారులు, సిబ్బంది క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారన్నారు. పింఛన్లు పొదుపుగా వాడుకుని ఆరోగ్యాన్ని కాపాడుకుని సంతోషంగా జీవించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ ఎంఎస్ఎస్.వేణుగోపాల్, తహశీల్దార్ జి.సుందర్ సింగ్, ఎపిఒ టి.మురళీకృష్ణ పాల్గొన్నారు.

పింఛన్లు పంపిణీ చేస్తున్న జిల్లా కలెక్టర్ నాగరాణి

తాబేళ్ల మృతిపై విచారణ చేపట్టాలి

మత్స్య, అటవీ, పశుసంవర్ధక శాఖల అధికారులతో విచారణ కమిటీ ఏర్పాటు - కలెక్టర్ చదలవాడ నాగరాణి

ప్రజాశక్తి - భీమవరం

పర్యావరణానికి హితం చేకూర్చే సముద్ర జీవులను సంరక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, తాబేళ్ల మృత్యువాత పడడంపై విచారణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. శనివారం కలెక్టరేట్లో కలెక్టర్ నాగరాణి అటవీ, మత్స్యశాఖల అధికారులతో సమావేశమయ్యారు. చినమైనవానిలంక, పెదమైనవానిలంక తీర ప్రాంతానికి చనిపోయిన తాబేళ్ల కొట్టుకు రావడానికి గల కారణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 19 కిలోమీటర్ల మేర సముద్రతీర ప్రాంతం ఉందన్నారు. బియ్యపు తిప్ప నుంచి మోలపర్రు మధ్య సముద్రతీర ప్రాంతంలో ముఖ్యంగా చినమైనవానిలంక, పెదమైనవానిలంక తీర ప్రాంతానికి పదుల సంఖ్యలో చనిపోయిన తాబేళ్ల కొట్టుకురావడం ఆందోళన కలిగించే అంశమన్నారు. ఈ విషయమై అటవీ, మత్స్య, పశుసంవర్ధక శాఖల అధికారులతో విచారణ బృందాన్ని నియమించినట్లు తెలిపారు. క్షేత్రస్థాయిలో బృందం పర్యటించి తాబేళ్ల చనిపోవడానికి కారణాలను విశ్లేషించడంతోపాటు, ఇప్పటికే చనిపోయిన తాబేళ్లకు పోస్టుమార్టం నిర్వహించి నివేదికను సమర్పించాలని ఆదేశించారు. సముద్ర ప్రాంతంలో గట్టు వలలను తాబేళ్ల గుడ్లు పెట్టే మాసాలు అక్టోబర్ నుండి ఫిబ్రవరి వరకూ నిషేధించాలని, ఈ విషయమై స్థానిక మత్స్యకారులకు వివరించాలన్నారు. ఇప్పటికే పెదమైనవానిలంక సముద్ర తీర ప్రాంతం కోతకు గురికావడం తెలిసిందే అన్నారు. సముద్ర తీర ప్రాంతానికి విఘాతం కలిగించే ఎటువంటి చర్యలకు పాల్పడినా ఉపేక్షించేది లేదని, తీర ప్రాంతంలో ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు వంటి ప్లాస్టిక్ వ్యర్థాలను పార వేయొద్దని విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ కారణంగా సముద్ర జీవులకు పెద్ద ఎత్తున ముప్పు వాటిల్లుతోందని, చాలా జీవులు చనిపోతున్నాయని ఇప్పటికే పలు పరిశోధనలు తేల్చి చెప్పాయని గుర్తుచేశారు. ఈ సమావేశంలో జిల్లా మత్స్యశాఖ అధికారి ఆర్‌విఎస్.ప్రసాద్, జిల్లా అటవీ శాఖ అధికారి డి.ఆశాకిరణ్, మత్స్య శాఖ సహాయ సంచాలకులు సిహెచ్.వెంకటేశ్వరరావు, ఎఫ్‌డిఒలు కె.వివేక్, కె.భారతి, ఎన్.శివరామకృష్ణ, పి.లావణ్య పాల్గొన్నారు.

అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నాగరాణి

తీరంలో అధికారుల పర్యటన

నరసాపురం:పశ్చిమ తీరంలో తాబేళ్ల మృత్యువాత ఆగడం లేదు. తాబేళ్లు చనిపోవుతుండడంతో మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాబేళ్ల కలేబరాలతో తీర ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. కలెక్టర్ ఆదేశాల మేరకు తీరంలో మత్స్య, పశువైద్యశాఖ, రెవెన్యూ, మైరెన్, అటవీ శాఖ అధికారులు శనివారం పర్యటించారు. ఏలూరు నుంచి డిఎఫ్‌ఒ ప్రసాద్, ఎడిలు రాజు, వెంకటేశ్వరరావు, కె.భరత్, సంఘ మిత్ర కిరణ్, సురేష్ కుమార్, రాంప్రసాద్, ఎఫ్‌డిఒ ప్రసాద్, వెటర్నరీ వైద్యుడు ఐ.సురేంద్ర కుమార్ తీరంలో పర్యటించారు. పిఎం లంక నుంచి మోళ్లపర్రు వరకూ మృతి చెందిన తాబేళ్ల కలేబరాలను పరిశీలించారు. కొన్ని తాబేళ్ల నుంచి శాంపిల్స్ సేకరించారు. వీటిని ప్రయోగశాలకు పంపించి పరీక్షలు నిర్వహించి మృత్యువాతకు గల కారణాలను నిర్ధారిస్తామన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని అధికారులు తెలిపారు. అనంతరం తాబేలు కళేబరాలను పూడ్చి పెట్టారు.

నరసాపురం : తీరంలో పర్యటిస్తున్న అధికారులు

ఆక్రమణలో శ్మశానవాటిక

చర్యలు తీసుకోవాలని పాత నవరసపురం గ్రామస్తుల నిరసన

ప్రజాశక్తి - నరసాపురం

పాత నవరసపురం గ్రామంలో తరతరాలుగా శ్మశానవాటికగా ఉన్న స్థలాన్ని వ్యక్తి కబ్జా చేశాడని, అతనిపై చర్యలు తీసుకోవాలని గ్రామానికి చెందిన మత్స్యకారులు డిమాండ్ చేస్తూ శనివారం నిరసన తెలిపారు. అనంతరం సమావేశంలో కోరాడ శ్రీనివాస్, తిరుమాని శంకర్, తిరుమాని లక్ష్మణరావు, తిరుమాని రమేష్, వాటాల సత్యనారాయణ, కారాడి లక్ష్మి మాట్లాడారు. కోనసీమ జిల్లా సఖినేటిపల్లి మండలం లక్కవరం గ్రామానికి చెందిన బండారు విజయ్ శ్మశానవాటిక సమీపంలో రొయ్యల చెరువులు సాగు చేస్తున్నాడని తెలిపారు. ఏటా శ్మశానవాటిక స్థలాన్ని కబ్జా చేస్తున్నాడని తెలిపారు. ఇటీవల రాత్రికి రాత్రి శ్మశానవాటిక స్థలంలో మట్టిని ప్రొక్లెయిన్తో తవ్వేస్తున్నాడు. దీంతో శ్మశానవాటికలో పూడ్చి పెట్టిన మృతదేహాల అస్తి పంజరాలు, పుర్రెలు, ఎముకలు సైతం భయట పడ్డాయన్నారు. సమీపంలోని మురుగు కాలువను కూడా మట్టితో పూడ్చేశాడని తెలిపారు. కబ్జా చేసిన ఆనవాళ్లు దొరకుండా పెద్ద పెద్ద కొబ్బరి మొక్కలను ఆక్రమించిన రొయ్యల చెరువుల చుట్టూ వేశాడని తెలిపారు. ఈ విషయాన్ని రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లామని, రెవెన్యూ సిబ్బంది కొలతలు వేసి భూ కబ్జాకు పాల్పడిన వ్యక్తికే విఆర్‌ఒ సత్తిబాబు వత్తాసు పలుకుతున్నారని ఆరోపించారు. శ్మశానవాటికను ఆక్రమించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని, ఆక్రమించిన స్థలాన్ని మళ్లీ యథావిధిగా అప్పగించాలని లేని పక్షంలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు. శ్మశానవాటిక స్థలం విషయం తేలే వరకూ ఆందోళన చేపట్టేందుకు కూడా వెనుకాడబోమన్నారు. ఈ సందర్భంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు తమకు న్యాయం చేయాలని గ్రామానికి చెందిన మహిళలు డిమాండ్ చేశారు.

నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ విద్యనందించాలి : కలెక్టర్

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా విద్యాబోధన సాగించాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై విద్యార్థుల తల్లిదండ్రులకు అర్థమయ్యేలా అవగాహన కల్పించాలి, విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్లో జిల్లా కలెక్టర్ నాగరాణి ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చేరికలు, పాఠశాలల పునర్వ్యవస్థీకరణపై డిఇఒ, భీమవరం, వీరవాసరం, గణపవరం మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశంను నిర్వహించారు. ఈ సందర్భంగా తక్కువ విద్యార్థులు ఉన్న పాఠశాలలను, పునర్వ్యవస్థీకరణ చేసేందుకు అనువుగా ఉన్న పాఠశాలలను గుర్తించేందుకు పిపిటి ద్వారా అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రయివేటు పాఠశాలల కన్నా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్న పిల్లలకు బంగారు భవిష్యత్ ఉంటుందని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. పునర్వ్యవస్థీకరణపై విద్యార్థుల తల్లిదండ్రులకు, వెనుకబడిన సామాజిక కులాల వారికి అర్థమయ్యే రీతిలో అధికారులు అవగాహన కల్పించాలన్నారు. ఒకరిద్దరు ఉన్న పాఠశాలల కన్నా, ఎక్కువ మంది విద్యార్థులు కలిగిన పాఠశాలల్లో చదువుకోవడం ద్వారా ఒకరి నుంచి ఒకరికి అనేక విషయాలు తెలుసుకోవడానికి వీలవుతుందని, తద్వారా వారికి మంచి ఆలోచనలు, తెలివితేటలు కలుగుతాయన్నారు. మెరుగైన సమాజ నిర్మాణానికి కృషి చేయాలన్నారు. ఈ విషయంలో తన పూర్తి సహాయ, సహకారాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఇ.నారాయణ, భీమవరం, వీరవాసరం, గణపవరం మండలాల ఎంఇఒలు ఎన్.శ్రీనివాసరావు, వి.వెంకటేశ్వరరావు, ఎన్.రాజేష్, ఎంఎన్.శ్రీమన్నారాయణ, జి.బ్రహ్మయ్య, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

అర్జీలను త్వరతగతిన పరిష్కరించాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - భీమవరం

రెవెన్యూ సదస్సులు, రీ సర్వే గ్రామసభలలో స్వీకరించిన అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి సంబంధిత శాఖల అధికారులు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని జెసి ఛాంబర్‌లో వివిధ రెవెన్యూ అంశాలపై ఆయన సమీక్షించారు. గ్రామ రెవెన్యూ సదస్సులు, రీ సర్వే, 22-ఏ ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ అంశాలపై డిఆర్‌ఒ, కలెక్టరేట్ ల్యాండ్ సూపరింటెండెంట్, జిల్లా సర్వే అధికారి, పాలకొల్లు, వీరవాసరం, గణపవరం, ఇరగవరం, అత్తిలి, తహశీల్దార్‌లతో సమీక్షించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ రెవెన్యూ గ్రామ సభల్లో వచ్చిన అర్జీల నమోదు, రీ సర్వే, 22-ఏ ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ అంశాలపై సమీక్షించి ఈ అంశాలకు సంబంధించి త్వరితగతిన పురోగతి సాధించాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో డిఆర్‌ఒ మొగిలి వెంకటేశ్వర్లు, జిల్లా సర్వే ఇన్‌ఛార్జి అధికారి శ్రీనివాస్, కలెక్టరేట్ ల్యాండ్ సూపరిటెండెంట్ హెచ్.రవికుమార్, తహశీల్దార్లు వై.దుర్గాకిషోర్, ఎవి.రామాంజనేయులు, వైకెవి.అప్పారావు, డివివి.సుబ్రహ్మణ్యేశరావు, ఎం.సుందర్ రాజు పాల్గొన్నారు.

బడ్జెట్లో రాష్ట్రానికి అన్యాయం

సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్

భీమవరం : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో ఆంధ్రప్రదేశ్ ప్రజల ఆశలను మరోసారి అడియాసలు చేసిందని, కేంద్ర బిజెపి మరోసారి చేసిన ఈ ద్రోహానికి వ్యతిరేకంగా జిల్లా వ్యాప్తంగా ప్రజలు నిరసన వ్యక్తం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి.గోపాలన్ విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం సిపిఎం జిల్లా కమిటీ తరఫున ఆయనొక ప్రకటన విడుదల చేశారు. కేంద్ర బడ్జెట్లో ఎపికి కేంద్రం మళ్లీ మొండి చేయి చూపించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రత్యేకహోదా, వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధి ప్యాకేజీ వంటి విభజన హామీలను ప్రస్తావించకపోవడం అన్యాయమన్నారు. విభజన చట్టం ప్రకారం వచ్చిన ఏ జాతీయ విద్యా సంస్థకు కేటాయింపులు చేయలేకపోవడం బాధాకరమన్నారు. కేంద్రాన్ని నిలదీస్తున్నాము, వినతులు ఇచ్చాము అని ప్రచారం చేసుకునే రాష్ట్ర ప్రభుత్వం తమ విజ్ఞప్తులను కూడా కేంద్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించాలాన్నారు. రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై అన్ని పార్టీల ఎంపీలు కేంద్రాన్ని నిలదీయాలని డిమాండ్ చేశారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు గతేడాది రూ.8.622 కోట్లు కేటాయిస్తే, ప్రస్తుత బడ్జెట్లో రూ.3,295 కోట్లు కేటాయించిందని, అంటే గతేడాది కంటే బడ్జెట్‌లో రూ.5,327 కోట్లను తగ్గించడమే కాకుండా ఆర్భాటంగా ప్రకటించిన రూ.11,440 కోట్లు ప్యాకేజీ ప్రస్తావన లేకపోవడం బిజెపి ద్వంద్వ వైఖరి ప్రజలకు అర్థమవుతోందని విమర్శించారు. కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ మాత్రం బడ్జెట్ గొప్పగా ఉందనడం సిగ్గుచేటని, స్టీల్ ప్లాంట్ ప్రయివేటీకరణ నిలుపుదల గురించి మాట్లాడకపోవడం రాష్ట్ర ప్రజలను మోసం చేయడమే అన్నారు. పోలవరం ప్రాజెక్టుకు గతేడాది రూ.5,512.50 కోట్లు కేటాయిస్తే, ఈసారి రూ.5,936 కోట్లు కేటాయించిందని అయితే కనీసం పునరావసం, పరిహారం ప్యాకేజీ గురించి స్పందించకపోవడం అన్యాయమన్నారు. రూ.55 వేల కోట్లు తాజా అంచనాలకు రూ.33 వేల కోట్లు తగ్గిందన్నారు. నిర్వాసితులకు కోత విధించడానికే ప్రభుత్వం సిద్ధపడడం దుర్మార్గమని, ఈ బడ్జెట్లో జిల్లాకు కూడా కనీసం మేలు చేసేదేమీ లేదని, జిల్లాకు, రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం చేసిన ద్రోహంపై ప్రజలు, సిపిఎం శ్రేణులు నిరసన తెలపాలని అన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

మంత్రి నిమ్మలకు సచివాలయ ఉద్యోగుల సంఘం నేతల వినతి

పాలకొల్లు రూరల్ : సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్ చానల్, జాబ్ చార్ట్ సమస్యల గురించి సచివాలయ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యాన జలవనరుల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడును శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఉమర్ అలీషా మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల రేషనలైజేషన్, కేటగిరైజేషన్ సమస్యల గురించి తెలియపరిచామని అన్నారు. ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ రేషనలైజేషన్, ఉద్యోగుల కేటగిరైజేషన్ విషయంలో ఉద్యోగ సంఘాలతో చర్చించాలని కోరారు. ఏకపక్షంగా నిర్ణయం చేస్తే గత 5 సంవత్సరాల నుంచి పేరుకుపోయిన సమస్యలతో పాటు కొత్త సమస్యలు ఏర్పడతాయని తెలియజేశామన్నారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ ప్రభుత్వం సచివాలయ ఉద్యోగులను సమర్థవంతంగా ఎలా ఉపయోగించుకోవాలో ఆలోచన చేస్తున్నట్లు తెలిపారు. డిజిటల్ అసిస్టెంట్‌లను ఎఎస్‌ఒలుగా ఉపయోగించుకోవాలని నిర్ణయం తీసుకున్నామని, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లను జల వనరుల శాఖలో ఎలా ఉపయోగించుకోవాలని ఆలోచన చేస్తున్నట్లు, ఆ ప్రక్రియలో కొన్ని సర్వీసు సమస్యలు ఉన్నట్లు తెలిపారు. మహిళా సంరక్షణ కార్యదర్శిల విషయంలో కూడా సమస్యలు ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు జిఆర్‌ఎస్‌ఎన్.రాజు, పాలకొల్లు తాలూకా అధ్యక్షులు సునీల్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షులు ఉమర్ అలీషా, పాలకొల్లు తాలూకా నాయకులు నారాయణ రాజు, డిజిటల్ అసిస్టెంట్స్ సాయి కాంత్, ప్రశాంత్, షబానాం ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ సత్య సునీల్, కార్తీక్, మహిళా పోలీసులు భాను, కనకదుర్గ, లావణ్య వెల్ఫేర్ అసిస్టెంట్ వెంకటరమణ పాల్గొన్నారు.

విద్యార్థులు స్టెమ్ కోర్సులపై పట్టు సాధించాలి

నిట్ ప్లానింగ్ అండ్ డెవలప్మెంట్ డీన్ సందీప్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

విద్యార్థులు స్టెమ్ కోర్సులపై(సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, గణితం) పట్టు సాధించాలని ఎపి నిట్ ప్లానింగ్ అండ్ డెవలప్‌మెంట్ డీన్ డాక్టర్ వి.సందీప్ సూచించారు. ఎపి నిట్ ఇన్‌ఛార్జి డైరెక్టర్, ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌వి.రమణారావు ఆధ్వర్యంలో రిజిస్ట్రార్ డాక్టర్ పి.దినేష్ శంకర్ రెడ్డి ఆదేశాల మేరకు ఏలూరులోని కేంద్రీయ విద్యాలయానికి చెందిన 91 మంది విద్యార్థులు శనివారం నిట్ ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ సందీప్ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాల కోసం ఎదురు చూడకుండా ఉద్యోగాలను సృష్టించే స్థాయికి ఎదగాలన్నారు. దేశపురోగతిలో టెక్నాలజీ ప్రముఖ పాత్ర పోషిస్తుందని, దీనిని సమర్థవంతంగా వినియోగించుకుంటే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని తెలిపారు. విద్యార్థులు పాఠ్యాంశాలతో పాటు కృత్రిమ మేధ, మిషన్ లెర్నింగ్ వంటి నూతన సాంకేతికతలపై అవగాహనను పెంచుకోవాలని చెప్పారు. విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని వాటి సాధనకు నిరంతరం శ్రమించాలని వివరించారు. విద్యార్థులు ఇండోర్ స్టేడియం, ప్రయోగశాలలు, వర్క్‌షాపులు, గ్రంథాలయాన్ని పరిశీలించి యంత్రాల పనితీరును సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేంద్రీయ విద్యాలయ అధ్యాపకులు రామ్మూర్తి, రామ, శృతి, రేఖాకుమారి, శ్రీలత పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికల్లో నిబంధనలు పాటించాలి

మొగల్తూరు : శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గం ఎన్నికలలో నిబంధనలు పాటించి, సహకరించాలని తహశీల్దార్ కె.రాజకిషోర్ రాజకీయ పార్టీ నాయకులను కోరారు. మొగల్తూరులోని రెవెన్యూ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మొగల్తూరులోని పెనుమత్స రంగరాజ జెడ్‌పి ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేయనున్న పోలింగ్ కేంద్రంలో ఓటు హక్కును వినియోగించుకోవచ్చని ఆయన సూచించారు. ఈ పోలింగ్ కేంద్రంలో 1735 మంది వాటర్లు ఉన్నారని ఆయన అన్నారు.

5న కార్మిక నిరసన ప్రదర్శనలు జయప్రదం చేయాలి

పాలకొల్లు : ఈనెల 5వ తేదీన జరిగే కార్మిక నిరసన ప్రదర్శనలు జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాసరావు కోరారు. శనివారం సంఘ కార్యాలయంలో మండల సమావేశం గుబ్బల సత్యనారాయణ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తెచ్చిన లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల పోరాటం ద్వారా సాధించుకున్న చట్టాలను పెట్టుబడిదారులకు అనుకూలంగా మార్చేందుకే లేబర్ కోడ్‌లు తెస్తున్నారని విమర్శించారు. ఒక పక్క నిరుద్యోగం, మరో పక్క నిత్యావసర సరుకుల ధరలు పెరుగుతుండటంతో కార్మికవర్గం ఇబ్బందులు ఎదుర్కొంటుందని అన్నారు. లేబర్ కోడ్‌లతో ఉన్న హక్కులు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. హక్కుల రక్షణకై ఫిబ్రవరి 5న దేశవ్యాప్త నిరసన ప్రదర్శనలతో కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని శ్రీనివాస్ కోరారు. ఈ సమావేశంలో వీరవల్లి సత్యనారాయణ, వేగి తత్తయ్య, వెంకటేశ్వర్లు, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పేద విద్యార్థికి మందులు అందజేత

పాలకొల్లు : డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం దగ్గరలో ఉన్న లక్ష్మీ పోలవరం గ్రామానికి చెందిన 5వ తరగతి చదువుతున్న పేద విద్యార్థి చోడిశెట్టి హేమంత్ ప్రసాద్ టైప్-1 మధుమేహ వ్యాధితో బాధపడుతున్నారు. మందుల నిమిత్తం నెలకు రూ.7 వేలు ఖర్చు చేయడం ఆ పేద కుటుంబానికి తలకు మించిన భారంగా మారింది. తెలిసినవారు పాలకొల్లు వాకర్స్ క్లబ్ సహాయ కార్యక్రమాల గురించి తెలపడంతో వారు క్లబ్‌ను సంప్రదించగా శనివారం వారిని పాలకొల్లు రప్పించి, ఆ అబ్బాయికి అవసరమైన మందులకు సరిపడా రూ.22 వేల విలువైన మందులను క్లబ్ అధ్యక్షుడు తటవర్తి సుధాకరరావు అందించారు. అడిగిన వెంటనే సాయం అందించిన వాకర్స్ క్లబ్ వారికి తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి షేక్ పీర్ సాహెబ్, కోశాధికారి పోతుల ఉమాశంకరరావు, ఉపాధ్యక్షులు మానెం జనపరాజు, సలాది రామచంద్రరావు, క్లబ్ సభ్యులు జవ్వాజి కళ్యాణ్, కర్రి కిరణ్ పాల్గొన్నారు.

అంతరిస్తున్న చేతివృత్తులు

పిఎంయు ఉదయ్ కుమార్

ఆకివీడు : అనాదిగా భారతీయ సమాజంలో చేతివృత్తులు గురుపరంపరాగా వస్తున్న కళాత్మక విద్య అని, అటువంటి కళలు అంతరించిపోతే భావితరాలకు విజ్ఞానం అందకుండా పోతుందని విశ్వకర్మ యూనిట్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సిహెచ్.ఉదయ్ కుమార్ అన్నారు. దుంపగడప వివిధ ప్రభుత్వ డిగ్రీ కళాశాల నైపుణ్య శిక్షణ సంస్థ ద్వారా ఏర్పాటు చేసిన విశ్వకర్మ యోజన అవగాహన సదస్సు శనివారం స్థానిక లయన్స్ కళ్యాణ మండపంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుజాత అధ్యక్షతన జరిగింది. ప్రస్తుతం మార్కెట్లో చేతివృత్తులతో చేసిన వస్తువులకు మార్కెటింగ్ కరువైందన్నారు. ముడిసరుకు లభించక ధరలు అధికంగా పెరిగిపోవడంతో వస్తువుల ధరలు పెరుగుతున్నాయన్నారు. ఫలితంగా వాటిపై ఎక్కువమంది మొగ్గు చూపటం లేదన్నారు. ఈ పరిస్థితులను అధిగమించేందుకు ప్రభుత్వం రాయితీలతో కూడిన రుణాలు ఇవ్వటంతో పాటు శిక్షణ కూడా అందిస్తోందన్నారు. విశ్వకర్మ యోజన పథకం ద్వారా ఈ విధానాలు అమలు చేస్తున్నామన్నారు. ఈ పథకం ద్వారా 18 రకాల నైపుణ్య శిక్షణను అందిస్తున్నామన్నారు. వీటిలో మూడు అంశాలకు శిక్షణ దుంపగడప కళాశాలలో ఈ వారంలో ప్రారంభిస్తున్నామన్నారు. ఈ శిక్షణకు హాజరు అయ్యేవారు తమ ఆధార్ కార్డుతో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. సిఐటియు నాయకులు పెంకె అప్పారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చే లక్ష రూపాయలతో పథకం చేయడం కష్టమని, రుణపరిమితి పెంచాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు దాసరి సత్యనారాయణ నిర్వహించారు.

ఇంటింటా పెన్షన్ల పంపిణీ

నరసాపురం : పట్టణంలో ఎన్‌టిఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమం చురుగ్గా సాగిందని నరసాపురం మున్సిపల్ కమిషనర్ ఎం.అంజయ్య అన్నారు. శనివారం కమిషనర్ స్వయంగా లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్లను పంపిణీ చేశారు. శ్రీహరిపేట, పొన్నపల్లి, ఏడుకొండలమ్మ గుడి, పీచుపాలెం కాలనీ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి వెళ్లి పెన్షన్ అందజేశారు. వారి కుటుంబ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. మంచి నీరు, డ్రైనేజీ, వీధి లైటింగ్ సమస్యలు, మున్సిపాలిటీ నుంచి ఏవిధమైన సమస్య ఉన్నా తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో పెన్షన్ గుమస్తా ఆకుల సాయి, సత్యనారాయణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


కృష్ణవేణి దంపతులను సాలువాతో సన్మానిస్తున్న తోటి ఉపాధ్యాయులు

విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన ధీశాలి

కృష్ణవేణి ఉద్యోగ విరమణ అభినందన సభలో ఉపాధ్యాయులు

ఆచంట : నిబద్ధత, అంకిత భావం, సహృదయం, సేవాభావం, విశిష్ట లక్షణాలతో విద్యార్థుల శ్రేయస్సే పరమావధిగా 42 సంవత్సరాల పాటు సుదీర్ఘ సేవలందించిన ధీశాలి నెక్కంటి కృష్ణవేణి అని ఎంఇఒ-1, ఎ.ఉషారాణి, పి.రాజేంద్రప్రసాద్‌లు అన్నారు. ఆచంట వేమవరం, జెడ్‌పిహెచ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నెక్కంటి కృష్ణవేణి ఉద్యోగవిరమణ అభినందన సభ శనివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంఇఒలు పాల్గొని మాట్లాడుతూ సమర్థవంతమైన దీక్షకులూ అధికారులు, తల్లిదండ్రులు, విద్యార్థుల ఆదరాభిమానాలతో ప్రశంసలు అందుకున్న అసమాన ప్రజ్ఞాశాలి అని కొనియాడారు. 42 సంవత్సరాలు ఉపాధ్యాయ జీవితంలో, 17 సంవత్సరాలపాటు ఎస్‌జిటిగాను, 19 సంవత్సరాల పాటు ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయులుగాను, 6 సంవత్సరాలు హైస్కూల్ ప్రధానోపాధ్యాయునిగా పనిచేసిన ప్రతి పాఠశాలలోనూ అత్యున్నత ప్రమాణాలతో తీర్చిదిద్దిన ధీశాలి అని కొనియాడారు. 2002వ సంవత్సరంలో నర్సాపురం మండలంలో మండల ఉత్తమ ఉపాధ్యాయునిగా, 2007లో జిల్లా ఉత్తమ ప్రధాన ఉపాధ్యాయునిగా, 2008లో జిల్లా ఉత్తమ మహిళా ఉపాధ్యాయునిగా, 2017లో సావిత్రిబాయి పూలే రాష్ట్రస్థాయి ఉత్తమ మహిళా ఉపాధ్యాయునిగా ఎన్నికై ఆనాటి విద్యాశాఖ మంత్రి గంటా శ్రీనివాస్ చేతుల మీదుగా అవార్డులు తీసుకోవడం అభినందనీయమని కొనియాడారు. ఈ సందర్భంగా కృష్ణవేణి దంపతులను ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు.

చేపల వేటకు వెళ్లి మత్స్యకారుడు మృతి

నరసాపురం : చేపలు వేటాడేందుకు వెళ్లిన మత్స్యకారుడు కాలువలో పడి మృతిచెందిన ఘటన నరసాపురంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నరసాపురం మండలం లక్ష్మణేశ్వరం గ్రామం ముస్కెపాలెంకు చెందిన కొపనాతి లక్ష్మణ స్వామి(57) గురువారం చేపలు వేటాడేందుకు కాలువలోకి వెళ్లాడు. ఎంతకీ ఇంటికి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు, బంధువులు చుట్టుపక్కల గాలించినా లక్ష్మణ స్వామి జాడ తెలియలేదు. శనివారం ఉదయం గాలిస్తుండగా వేములదీవి కాలువలో శవమై కనిపించాడు. దీనిపై లక్ష్మణ స్వామి భార్య కొపనాతి దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. శనివారం ఘటన స్థలాన్ని ప్రభుత్వ విప్, ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సందర్శించి ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం మృతుడు కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్ష్మణ స్వామి కుటుంబాన్ని ప్రభుత్వం తరఫున అన్నివిధాల ఆదుకోవాలని అధికారులను ఎంఎల్ఎ ఆదేశించారు. ఎంఎల్ఎ వెంట మత్స్యకార సహకార సంఘాల జిల్లా అధ్యక్షులు మైల వసంతరావు, గ్రామ సర్పంచి తిరుమాని వెంకటరాజు, అంద్రాజు చల్లారావు పాల్గొన్నారు.

ఎస్ఐ అనుమానాస్పద మృతి

తణుకు రూరల్ : విఆర్‌లో ఉన్న ఎస్ఐ ఎజిఎస్.మూర్తి స్టేషన్ ఆవరణలో మృతి చెందిన సంఘటనపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు తణుకు రూరల్ ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. మృతదేహానికి శుక్రవారం పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబ సభ్యులకి అప్పగించారు. మూర్తి మృతదేహానికి అంబేద్కర్ కోనసీమ జిల్లా కె.గంగవరంలో శనివారం పోలీసు లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

వ్యాన్ బోల్తా : తప్పిన పెనుప్రమాదం

ఉండి : ఉండి-భీమవరం జాతీయ రహదారిపై ఎన్ఆర్‌పి అగ్రహారం వద్ద జీపు, ఐషర్ వ్యాన్ ఢీకొన్న సంఘటనలో పెను ప్రమాదం తప్పింది. శనివారం ఉదయం మంచు దట్టంగా ఉండటంతో ఉండి నుంచి పాలకొల్లు వెళుతున్న ఐసర్ వ్యాన్ ఎదురుగా ఉన్న జీప్‌ను ఓవర్ టేక్ చేయబోయి సడన్ బ్రేక్ వేయడంతో వ్యాన్ టైర్ ఊడిపోవడంతో రోడ్‌కి అడ్డంగా వ్యాన్ పడిపోయింది. అటుగా వస్తున్న కార్ వ్యాన్‌ను స్వల్పంగా ఢీకొనడంతో పెను ప్రమాదం తప్పింది. ప్రమాదంలో ఎవరికీ ప్రాణ నష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సంఘటనలో గాయపడిన వారిని స్థానికులు అంబులెన్స్ ద్వారా ఆసుపత్రికి తరలించారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

మద్యం షాపుల యజమానులు నిబంధనలు పాటించాలి

తణుకు ఎక్సైజ్ సిఐ సత్తిమణికంఠ రెడ్డి

చిట్‌చాట్

ప్రజాశక్తి - పెనుమంట్ర

అన్ని మద్యం షాపుల యజమానులూ ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా అమలు చేయాలని తణుకు డివిజన్ ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సత్తి మణికంఠరెడ్డి అన్నారు. గురువారం తణుకు సర్కిల్ పరిధిలోని పెనుమంట్ర మండలం పరిశీలనకు వచ్చిన ఆయనతో ప్రజాశక్తి జరిపిన ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

మీ సర్కిల్ పరిధిలో ఎన్ని మండలాలు ఉన్నాయి?

తణుకు సర్కిల్ పరిధిలో తణుకు మున్సిపాల్టీ, తణుకు రూరల్‌తో పాటు ఇరగవరం, పెనుమంట్ర, పెనుగొండ మండలాలు ఉన్నాయి.

సర్కిల్ స్టేషన్లో ఏయే సిబ్బంది పనిచేస్తున్నారు?

తనతో పాటు ఇద్దరు ఎస్ఐలు ఆర్.మధుబాబు, బి.లక్ష్మి, ముగ్గురు హెడ్ కానిస్టేబుళ్లు కె.శ్రీనివాస్, ఎన్.అప్పలస్వామి, వై.శ్రీమన్నారాయణ, ఇంకా ఐదుగురు కానిస్టేబుల్స్ కాగా మొత్తం 11 మంది సిబ్బంది ఉన్నారు.

జనవరిలో ఇప్పటి వరకూ ఎన్ని కేసులు నమోదయ్యాయి?

ఈ నెలలో ఇప్పటి వరకూ అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిపై, బెల్ట్ షాపు నిర్వాహకులపై 16 కేసులు నమోదు చేశాం. తొమ్మిది మందిని అరెస్టు చేశాం. ఇరగవరం మండలంలోని ఒక ముద్దాయి నుండి రూ.10 వేల జరిమానా కట్టించాం.

నకిలీ, విదేశీ మద్యం గురించి ఏమైనా కేసులు పెట్టారా?

లేదు. అయితే చాలా చోట్ల విదేశీ మద్యానికి ఉన్న డిమాండ్ బట్టి జానీవాకర్, బ్లాక్ లేబుల్ బ్రాండెడ్ విదేశీ మద్యం పేరు చెప్పి ఆ ఖాళీ సీసాల్లో లోకల్ బ్రాండ్స్ మద్యం నింపి అమ్ముతున్నారు. ఎవరైనా లీగల్‌గా ఏర్పాటైన మద్యం షాపుల్లో కొనుక్కోవాలి తప్ప వ్యక్తుల వద్ద కొనడం మంచిది కాదు.

మీ సర్కిల్ పరిధిలో ఎన్ని మద్యం షాపులు ఉన్నాయి?

మొత్తం 33 షాపులు ఉన్నాయి. తణుకు మున్సిపల్ పరిధిలో 9, రూరల్‌లో 5, ఇరగవరం మండలంలో 4, పెనుమంట్ర మండలంలో 6, పెనుగొండ మండలంలో 9 షాపులు ఉన్నాయి.

బ్రాందీ షాపుల వద్ద పర్మిట్ రూములకు అనుమతి ఉందా?

ఎక్కడా పర్మిట్ రూములకు అనుమతి లేదు. మైనర్లకు మద్యం అమ్మినట్టు తేలినా, పాన్ షాపులు, రెస్టారెంట్లలో మద్యం తాగినా కేసులు నమోదు చేస్తాం.

3న మార్టేరుకు కలెక్టర్ రాక

ప్రజాశక్తి - పెనుమంట్ర

ఈనెల 3వ తేదీ సోమవారం ఉదయం 9 గంటలకు మండలంలోని మార్టేరు ఎస్‌విజి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి వస్తున్నారని మండల విద్యాశాఖ అధికారులు వై.లక్ష్మీనారాయణ, యు.నాగేశ్వరరావు శనివారం తెలిపారు. పాఠశాలలోని అన్ని తరగతుల విద్యార్థినులకు చెందిన సెల్ఫ్ డిఫెన్స్ ఫర్ గర్ల్స్ అనే కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రారంభిస్తారని వారు పేర్కొన్నారు.

అపుస్మా ఇంటర్ స్పోర్ట్స్ మీట్‌లో ఆర్కిడ్జ్ విద్యార్థుల విజయదుందుభి

పాలకొల్లు రూరల్ : అపుస్మా ఇంట్రాజోనల్ స్పోర్ట్స్ మీట్ 2024-25 జిన్నూరు ఐడియల్ పాఠశాల ఆవరణలో శనివారం ఘనంగా నిర్వహించారు. దీనిలో పాలకొల్లు మండలంలోని అన్ని ప్రయివేట్ పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా, ఉల్లాసంగా పాల్గొన్నారు. దీనిలో భాగంగా పాలకొల్లు రూరల్ లక్ష్మీనగర్‌లోని ఆర్కిడ్జ్ పాఠశాల విద్యార్థులు తమదైన శైలిలో అత్యుత్తమ ప్రతిభకనబరచారు. పాల్గొన్న 42 స్కూల్స్ విద్యార్థులలో ఆర్కిడ్జ్ విద్యార్థులు అధికంగా 15 బహుమతులు గెలుపొంది, ప్రముఖుల ప్రశంసలు అందుకున్నారని స్కూల్ డైరెక్టర్, సైకాలజిస్ట్ ఎంపీ జానకీరామ్ తెలియజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేసిన అభినందన సభలో విద్యార్థులను పాఠశాల విద్యార్థులు కరతాలధ్వనులతో స్వాగతం పలికారు. ఆర్కిడ్జ్ స్కూల్‌లో అకడమిక్స్‌తో పాటుగా కో కరిక్యులర్, ఎక్స్‌ట్రా కరిక్యులర్ విషయాలలో ప్రాముఖ్యతను ఇవ్వడం వల్ల ఇటువంటి విజయాలు సాధించగలుగుతున్నామని, అందుకు సహకరిస్తున్న ఉపాధ్యాయులకు, తల్లితండ్రులకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రిన్సిపల్ జానకీరామ్ ఉపాధ్యాయులు, విద్యార్థుల పోటీతత్వాన్ని కొనియాడి విజేతలను ఘనంగా అభినందించి, సత్కరించి తమ హర్షం వ్యక్తం చేశారు.

సౌత్ జోన్‌కు భీమవరం సీతా పాలిటెక్నిక్ విద్యార్థిని ఎంపిక

భీమవరం టౌన్ : పద్మభూషణ్ డాక్టర్ బివి.రాజు ఫౌండేషన్, శ్రీవిష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ వారి బి.సీతా పాలిటెక్నిక్ కళాశాలకు చెందిన విద్యార్థిని పి.నాగలక్ష్మి(ఇసిఇ సెకండ్ ఇయర్) ఇటీవల విశాఖపట్టణంలో జరిగిన రాష్ట్రస్థాయి బాలురు, బాలికల ఇంటర్ పాలిటెక్నిక్ స్పోర్ట్స్, గేమ్స్ మీట్‌లో బాలికల విభాగంలో హై జంప్‌లో ప్రథమ స్థానం సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ సిహెచ్.రామకృష్ణ తెలిపారు. శనివారం కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ ఫిబ్రవరి నెల రెండవ వారం కర్ణాటకలో జరిగే సౌత్ జోన్‌లో హై జంప్ విభాగంలో పాల్గొననున్నట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ జిబిఎస్.కుమార్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా విజయం సాధించిన విద్యార్థిని సొసైటీ మేనేజ్‌మెంట్, బి.సీతా పాలిటెక్నిక్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ జి.శ్రీనివాస్ రావు, ప్రిన్సిపల్ సిహెచ్.రామకృష్ణ, హెడ్ ఆఫ్ ది డిపార్ట్మెంట్స్, ఫిజికల్ డైరెక్టర్ జిబిఎస్.కుమార్ రాజు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న కళాశాల యాజమాన్యం

3 నుంచి వైఎన్‌లో జాతీయ సమైక్యత శిబిరం

నరసాపురం : వైఎన్ కళాశాలలో మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, ఎన్ఎస్ఎస్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 3వ తేదీ నుంచి 9వ తేదీ వరకు జాతీయ సమైక్యత శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల సెక్రటేరియట్, కరస్పాండెంట్ డాక్టర్ చినిమిల్లి సత్యనారాయణ రావు తెలిపారు. శనివారం కళాశాలలో పత్రికా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సత్యనారాయణ రావు మాట్లాడుతూ వారం రోజుల పాటు జరిగే ఈ శిబిరానికి దేశంలోని 12 రాష్ట్రాల నుంచి 200 మంది విద్యార్థులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు హాజరవుతారన్నారు. ఈ శిబిరానికి హాజరయ్యే వాలంటీర్లకు కావలసిన అన్ని ఏర్పాట్లను కళాశాల పూర్తి చేసిందన్నారు. ఎన్ఎస్ఎస్ ఆఫీసర్లైన చింత సోమేశ్వరి, సాదే యాకోబులు ఈ శిబిరాన్ని నిర్వహిస్తున్నారని, వాటికి కావాల్సిన ఏర్పాట్లను వీరిద్దరి సమక్షంలో జరుగుతుందన్నారు. గతంలో 2023లో నరసాపురం వైఎన్ కళాశాల ఈ క్యాంప్ నిర్వహించడం జరిగిందన్నారు. దేశంలోనే రెండేళ్ల వ్యవధిలో ఒకే కళాశాల రెండు సార్లు నిర్వహించిన ఘనత వైఎన్ కళాశాల దక్కించుకుందన్నారు. ఈనెల మూడో తేదీ సోమవారం శిబిర ప్రారంభోత్సవం జరుగుతుందని, దానికి ముఖ్యఅతిథిగా నన్నయ యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ హాజరు కావచ్చునని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల కోశాధికారి పోలిశెట్టి శ్రీరఘు రామారావు, వైఎన్ డైమండ్ జూబ్లీ జూనియర్ కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ అందే రామ సతీష్, గవర్నమెంట్ బాడీ సభ్యులైన గుడివాడ సాయి రాధాకృష్ణ, కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చింతపల్లి కనకారావు పాల్గొన్నారు.

'జాతీయ సమైక్యతలో జిల్లా విద్యార్థులు'

విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల యాజమాన్యం

పాలకోడేరు : భీమవరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు అస్సాం అగ్రికల్చర్ యూనివర్సిటీలో జరిగిన జాతీయ సమైక్యత శిబిరంలో భాగస్వాములయ్యారు. 16 రాష్ట్రాల నుంచి విద్యార్థులు ఈ శిబిరంలో పాల్గొనడం జరిగింది. ఆంధ్రప్రదేశ్ నుంచి పదిమంది విద్యార్థులు జాతీయ సమైక్యతలో పాల్గొనగా దీనిలో జిల్లాకు చెందిన ముగ్గురు విద్యార్థులు కూడా భీమవరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలకు చెందిన విద్యార్థులు కావడం విశేషం. ఈ సందర్భంగా స్థానిక కళాశాలలో శనివారం విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేశారు. జాతీయ సమైక్యతలో పాల్గొన్న ఎన్ఎస్ఎస్ విద్యార్థులు కె.మనోహర్, పి.పావని, ఎం.చరిత్‌లను ప్రత్యేకంగా అభినందించారు. భీమవరం ఐసిడిఎస్ ప్రాజెక్టు సిడిపిఒ టికెవి.లక్ష్మీకాంతం విద్యార్థులను సత్కరించి మాట్లాడారు. విద్యార్థులు సేవా భావాన్ని అలవర్చుకోవడానికి ఇటువంటి శిబిరాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. కళాశాల వైస్ చైర్మన్ టివివి.ప్రసాద్ మాట్లాడుతూ తమ కళాశాల నుంచి జాతీయ సమైక్యతలో విద్యార్థులు పాల్గొనడం తమ కళాశాలకు ఎంతో గర్వకారణమని చెప్పారు. కళాశాల వైస్ చైర్మన్‌గా తనకెంతో ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కెజిఆర్ఎల్ కళాశాల జాయింట్ సెక్రెటరీ ఆరేటి ప్రకాష్, విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, మెంబర్ ఆఫ్ బిల్డర్స్ అసోసియేషన్ పుప్పాల శేషు విద్యార్థులను అభినందించారు.

పది విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలి

కలెక్టర్ నాగరాణి

ప్రజాశక్తి - కాళ్ల

ఉపాధ్యాయులు పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులపై దృష్టి పెట్టాలని, విద్యార్థులు ఇష్టపడి చదవాలని జిల్లా కలెక్టర్ చదలవాడ నాగరాణి అన్నారు. శనివారం కాళ్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవతరగతి పరీక్షల కోసం నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను జిల్లా కలెక్టర్ నాగరాణి ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 17వ తేదీ నుంచి జరగనున్న పదవతరగతి పరీక్ష ఫలితాలు నూటికి నూరుశాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఆడపిల్లల రక్షణ విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలని, ఆడపిల్లనుంచి ఎటువంటి చిన్న ఫిర్యాదు వచ్చినా వెనువెంటనే పరిష్కరించాలన్నారు. విద్యార్థులలో పరీక్షల భయాన్ని తగ్గించడానికి, అన్ని సబ్జెక్టులపై ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించాలని కలెక్టర్ తెలిపారు. అనంతరం కాళ్ల సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వసతి గృహాన్ని మొత్తం అణువణువునా పరిశీలించి, వసతి గృహాధికారికి పలు సూచనలు చేశారు. విద్యార్థులతో జిల్లా కలెక్టర్ మమేకమయ్యారు. ఈరోజు ఉదయం ఏం టిఫిన్ పెట్టారని అడగగా, ఇడ్లీ పెట్టారని విద్యార్థులు చెప్పడంతో కలెక్టర్ సంతృప్తిని వ్యక్తం చేశారు. వారం రోజుల క్రితం పంపిన దోమతెరలు ఉపయోగించుకుంటున్నారా, ఎలా పనిచేస్తున్నాయని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వసతి గృహాల్లో ఎటువంటి ఇబ్బందులు ఉన్నా తక్షణం తెలియజేయాలని, ఎటువంటి సౌకర్యాలు కావాలన్నా సమకూర్చుటకు సిద్ధంగా ఉన్నామని కలెక్టర్ భరోసా ఇవ్వడంతో విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ తనిఖీల్లో హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఎ.శ్రీకాంత్, ఉపాధ్యాయులు, నాన్ టీచింగ్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

భీమవరం హాస్పిటల్స్‌కు ప్రత్యేక గుర్తింపు

భీమవరం టౌన్ : భీమవరం పట్టణంలో గత 20 సంవత్సరాలుగా నాణ్యమైన వైద్య సేవలందిస్తున్న భీమవరం హాస్పిటల్స్ వైద్య సేవల రంగంతో పాటు వైద్య, విద్యా రంగంలోకి ప్రవేశించింది. భారత ప్రభుత్వ అధీకృత అత్యున్నత వైద్య విద్యా నిర్వహణ సంస్థ అయిన నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్స్, డిప్లొమేట్ ఆఫ్ నేషనల్ బోర్డు (డిఎన్‌బి) పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల నిర్వహణకు భీమవరం హాస్పిటల్స్‌కు ప్రత్యేక గుర్తింపునిచ్చింది. ఈ సందర్భంగా శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కెవి.కృష్ణంరాజు మాట్లాడుతూ 20 సంవత్సరాల క్రితం భీమవరం, పరిసర ప్రాంత ప్రజల కోసం 24 గంటలు అందుబాటులో వైద్య సేవలను అందించే ఉద్దేశ్యంతో సువిశాల ప్రాంగణంలో 200 పడకలతో వైద్యశాలను ప్రారంభించామని, అన్ని రకాల స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలను అందిస్తున్నామన్నారు. ఇప్పుడు నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ గుర్తింపుతో ఎంబిబిఎస్ తరువాత పోస్ట్ గ్రాడ్యుయేషన్ వైద్య, విద్యా కార్యక్రమాలను పశ్చిమగోదావరి జిల్లాలో మొట్టమొదటిసారిగా ప్రారంభిస్తున్నామన్నారు. అనస్థీషియా విభాగంలో కేరళ రాష్ట్రంకు చెందిన ఇద్దరు వైద్య విద్యార్థులు దేశవ్యాప్తంగా బోర్డు నిర్వహించిన పోస్ట్ గ్రాడ్యుయేషన్ నీట్ కౌన్సిలింగ్‌లో భీమవరం హాస్పిటల్స్‌ను ఎంచుకున్నారని, త్వరలో రేడియాలజీ, ఇతర స్పెషాలిటీ వైద్య విభాగాలలో సీట్లు అందుబాటులోకి రానున్నాయని డాక్టర్ కృష్ణంరాజు తెలియజేస్తూ ఈ ప్రాంతంలో తమ వైద్యశాలలో వైద్య, విద్యా కార్యక్రమాలను ప్రారంభించడం ఎంతో సంతోషంగా ఉందని తెలియజేశారు. ఈ సమావేశంలో ఛైర్మన్ డాక్టర్ గోపాలరాజు, డాక్టర్ ఆర్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దాతల సహకారంతో పాఠశాలల అభివృద్ధి

ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి

ప్రజాశక్తి - గణపవరం

స్థానిక పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వ సహకారంతో పాటు స్థానిక దాతల చేయూతనిస్తే పాఠశాలలు మరింతగా అభివృద్ధి చెందుతాయని గణపవరం ఎంపిడిఒ ఆర్.బేబి శ్రీలక్ష్మి అన్నారు. శనివారం జల్లికొమ్మర యుపి పాఠశాలలో దాతలు వంటాకుల రామకృష్ణ, పొత్తూరి సోమరాజు, కందుల రాజేష్‌లు పాఠశాలకి రూ.50 వేల విలువగల స్మార్ట్ టివిని సమకూర్చారు. టివిని సమకూర్చినట్లు స్కూల్ ప్రధానోపాధ్యాయులు కటకం సుందరకుమార్ తెలిపారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న శ్రీలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అందజేస్తూ వారి విద్యాభివృద్ధికి కృషిచేస్తుందని అన్నారు. గ్రామాల్లో దాతలు కూడా విద్యార్థులకు ఆన్‌లైన్ విద్యను అందించాలనే ఉద్దేశంతో స్మార్ట్ టివిని బహూకరించటం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు. టివిని అందించిన దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సిహెచ్.లీలా గోపాల్, ఉపాధ్యాయులు, దాతలు కురెళ్ల వెంకటరత్నం, కవల రాంబాబు, కందుల రాంబాబు పాల్గొన్నారు.

కొమ్మర యుపి స్కూల్లో స్మార్ట్ టివిని ఆన్ చేస్తున్న ఎంపిడిఒ

కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

బిల్డింగ్ వర్కర్స్ గౌరవాధ్యక్షులు చిన వీరభద్రం

ప్రజాశక్తి - తణుకురూరల్

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమం విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదని వేల్పూరు బిల్డింగ్ వర్కర్స్ సిఐటియు అనుబంధ యూనియన్ గౌరవ అధ్యక్షులు బళ్ల చిన వీరభద్రం అన్నారు. యూనియన్ సమావేశం శనివారం స్థానిక సాలిపేటలో యర్రా మల్లికార్జున అధ్యక్షతన నిర్వహించారు. భవన నిర్మాణ యజమానుల నుంచి, ఆయా నిర్మాణ కంపెనీల నుంచి సెస్ రూపంలో కార్మిక శాఖ వసూలు చేసి కార్మిక సంక్షేమ బోర్డులో జమ చేస్తారన్నారు. ఇలా వసూలు చేసిన నిధులు వెయ్యి కోట్లుపైగా సంక్షేమ బోర్డు నిధులను గత ప్రభుత్వం ఇతర పథకాలకు తరలించిందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం అధికారులు ఉండకపోవటంతో ప్రభుత్వం కూడా అదే తీరు వ్యవహరిస్తుందని విమర్శించారు. సంక్షేమ బోర్డు నిధులు ఏ ఇతర పథకాలకు మళ్లించరాదని చట్టం స్పష్టం చేస్తుందని, దీనిని దిక్కరిస్తే ప్రభుత్వాలపై చర్యలు తప్పవని సుప్రీంకోర్టు గతంలో స్పష్టం చేసిందని తెలిపారు. అయినా అప్పుడు ప్రభుత్వం నిబంధన తుంగలో తొక్కి, నిధులు పక్కదారి పట్టించిందన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం స్పందించి ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ బోర్డు ద్వారా కార్మికులకు పథకాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ సభ్యులు వాటాల నాగేశ్వరరావు, సొరపల్లి రామకృష్ణ, యాతం పెద్దిరాజు, ఆనందం గంగాధర్ రావు, అల్లాడి నాగ బలరాం, పిల్లి పరమేశ్వరరావు, కరేళ్ల అర్జున్, విప్పర్తి రవీంద్ర, దాసరి రమేష్ పాల్గొన్నారు.

చిత్తడి నేలలు.. ప్రకృతి పరిరక్షణకు నెలవులు

చిత్తడి నేలల ప్రాముఖ్యతపై అవగాహన కల్పిస్తున్న రైతు కార్యాచరణ సమితి నేతలు

కాళ్ల : చిత్తడి నేలలు ప్రకృతి పరిరక్షణకు నెలవులని రాష్ట్ర రైతు కార్యాచరణ సమితి ఉపాధ్యక్షులు మంతెన వెంకట రవివర్మ అన్నారు. శనివారం ఆయన ఏలూరుపాడులో విలేకరులతో మాట్లాడారు. ప్రపంచ చిత్తడి నేలల దినోత్సవం సందర్భంగా ఆటపాకనందు ఉన్నటువంటి కొల్లేరు పక్షుల అభయారణ్యంలో చిత్తడి నేలల ప్రాముఖ్యత, కొల్లేరు సరస్సు అభివృద్ధి సమితి, స్పేస్ సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. చిత్తడి నేలలు అనేక జీవరాసుల మనగడతోపాటు మానవుల మనుగడకు, పర్యావరణ పరిరక్షణకై ఎంతో అవసరమన్నారు. స్పేస్ సంస్థ ప్రెసిడెంట్ గోపిశెట్టి మురళీకృష్ణారావు మాట్లాడుతూ చిత్తడి నేలలు నీటిని శుభ్రపరచడంతో పాటు, భూగర్భ జలాలను పెంచటంతో పాటు, వరదల తీవ్రతను తగ్గిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో మంతెన హిమ, రామాయణం సతీష్, ఆకుల తేజ పాల్గొన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలి

కాళ్ల : నాలుగు లేబర్ కోడ్‌లు రద్దు చేయాలని సిఐటియు మండల అధ్యక్షులు గొర్ల రామకృష్ణ అన్నారు. శనివారం కాళ్లలో సిఐటియు మండల కమిటీ సమావేశాన్ని గొర్ల రామకృష్ణ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి సూరిబాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, స్మార్ట్ మీటర్లు రద్దుచేసి ప్రజలపై వేస్తున్న విద్యుత్ భారాలను తగ్గించాలన్నారు. స్కీం వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. గొర్ల రామకృష్ణ మాట్లాడుతూ ఈనెల 17, 18, 19 తేదీల్లో అంగన్వాడీ దీక్షలను జయప్రదం చేయాలన్నారు. ఇఎలు, ఆశావర్కర్ల చలో విజయవాడను జయప్రదం చేయాలని కోరారు. సంఘం ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం నాయకులు దాసరి వెంకటేశ్వరరావు, యిర్రింకి ఏడుకొండలు, ఇఎల సంఘం అమరావతి, బాతు రామస్వామి పాల్గొన్నారు.

నేటి నుంచి 'ప్లాస్టిక్ వద్దు బ్రో' క్యాంపెయిన్‌కి శ్రీకారం

ప్లాస్టిక్ నిషేధంపై అంబేద్కర్ చౌక్ వద్ద మానవహారం : జెసి

ప్రజాశక్తి - భీమవరం టౌన్

ఈనెల 1 నుంచి భీమవరం పట్టణంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్‌ను నిషేధించి, అమలుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టడం జరిగిందని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.రాహుల్ కుమార్ రెడ్డి అన్నారు. శనివారం భీమవరం పట్టణం అంబేద్కర్ చౌక్‌లో ప్లాస్టిక్ నిషేధంపై ఏర్పాటుచేసిన అవగాహన, మానవహారంలో జెసి పాల్గొన్నారు. తౌలుత భారతీయ విద్యా భవన్, డిఎన్ఆర్ కళాశాల ఎన్‌సిసి క్యాడెట్లు, ఎస్ఆర్‌కెఆర్ ఇంజనీరింగ్ కాలేజ్ విద్యార్థినులు, వార్డు సచివాలయాలు, మెప్మా, మున్సిపల్ కార్యాలయాల సిబ్బంది, స్థానిక ప్రజలు పెద్ద ఎత్తున మానవహారంగా ఏర్పడి ప్లాస్టిక్ నిషేధంపై సందేశాన్ని అందజేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి అందరి చేత ప్లాస్టిక్ నిషేధంపై సందేశాన్ని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా జెసి మాట్లాడుతూ నేటి నుంచి 'ప్లాస్టిక్ వద్దు బ్రో' క్యాంపెయిన్‌కు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. ఫిబ్రవరి 1 నుంచి భీమవరం పట్టణంలో సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ నిషేధం అమలు చేస్తున్నామని, ఇప్పటికే పలుమార్లు ప్రకటనల ద్వారా తెలియజేయడం జరిగిందన్నారు. వ్యాపారస్తులు స్వచ్ఛందంగా ప్లాస్టిక్ నిషేధం అమలుకు సహకరించాలని, ఉల్లంఘనకు పాల్పడే వారికి జరిమానాతో పాటు, నిబంధనల మేరకు చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఇప్పటికే జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో అమలుకు శ్రీకారం చుట్టి వాటర్ బాటిల్స్, ప్లేట్స్, టీ కప్స్ స్టీల్ వస్తువులను వినియోగించడం జరుగుతుందన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో, వేడుకల్లో, హోటల్స్‌లో స్టీల్ ఐటమ్స్ మాత్రమే వినియోగించాలని సూచించారు. అనంతరం అంబేద్కర్ సర్కిల్ చుట్టుపక్కల ఉన్న షాపులలో ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పిస్తూ చైతన్యవంతులను చేశారు. మానవహారంలో భీమవరం మున్సిపల్ కమిషనర్ కె.రామచంద్ర రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్ టి.త్రినాధరావు, శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి, కంతేటి వెంకటరాజు, రెడ్ క్రాస్ ప్రతినిధులు, వివిధ కళాశాలల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

అగ్రిప్రమాద బాధితులకు నిత్యావసరాలు అందజేత

మొగల్తూరు : బాధితులకు అండగా నాయకర్ చారిటబుల్ ట్రస్ట్ ఉంటుందని ట్రస్ట్ ఛైర్మన్ బొమ్మిడి సునీత అన్నారు. మండలంలోని కెపి పాలెం నార్త్ పంచాయతీ, నంబుల వారి మెరకలో శుక్రవారం రాత్రి నంబుల బాబీ నాయుడు, నంబుల నాగరాజులకు చెందిన రెండు తాటాకు ఇళ్లు విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నికి దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న వెంటనే నాయకర్ చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్, నర్సాపురం ఎంఎల్ఎ బొమ్మిడి నాయకర్ సతీమణి బొమ్మిడి సునీత నాయకర్ సంఘటన ప్రాంతానికి వెళ్లి బాధితులతో మాట్లాడారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబాలకు దుప్పట్లు, బియ్యం, కూరగాయలు, నిత్యావసరాలతో పాటు ఆర్థిక సహాయం అందించారు. బాధితులకు అండగా ట్రస్ట్ ఉంటుందని ఆమె భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నిప్పులేటి తారక రామారావు, అందే దొరబాబు, బొడ్డు త్రిమూర్తులు, కందులపాటి రామకృష్ణ ఉన్నారు.

పాఠశాలకు మైక్ సెట్ బహూకరణ

తణుకు రూరల్ : మండపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 2008-09 సంవత్సరం పదో తరగతి విద్యార్థులు పాఠశాలకు మైక్ సెట్ బహూకరించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆర్.మోహన్ బాబు తెలిపారు. పూర్వ విద్యార్థులను గ్రామ పెద్దలు ఆత్మకూరు రామకృష్ణ, జాన శ్రీనివాస్, ఉపాధ్యాయులు అభినందించారు.

వైసిపి హయాంలోనే పాఠశాల ఆధునికీకరణ

కాళ్ల : వైసిపి ప్రభుత్వ హయాంలో రూ.30 కోట్లతో ప్రభుత్వ పాఠశాలను ఆధునికరణ చేశామని వైసిపి జిల్లా అధ్యక్షులు ముదునూరి ప్రసాదరాజు అన్నారు. శనివారం పెదఅమిరంలోని వైసిపి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా ఫీజు రియంబర్స్‌మెంట్‌పై చిన్న చూపు చూస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో అమ్మ ఒడి, ఫీజు రియంబర్స్‌మెంట్ క్రమం తప్పకుండా అమలు చేశామన్నారు. విద్యార్థుల తరపున రియంబర్స్‌మెంట్, అమ్మఒడి జమ చేసే వరకు ప్రభుత్వంపై పోరాడతామన్నారు. జిల్లా ఉండి, పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌ఛార్జిలు పివిఎల్ నరసింహారాజు, గుడాల గోపి పాల్గొన్నారు.

ఘనంగా దుర్గారాజు జన్మదిన వేడుకలు

ఉండి: తెలుగు యువత మండల అధ్యక్షుడు రుద్రరాజు దుర్గారాజు జన్మదిన వేడుకలు తెలుగు యువత నాయకుల సమక్షంలో శనివారం సాయంత్రం ఉండిలోని కలిదిండి రామచంద్ర రాజు జన్మభూమి పార్క్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ టిడిపి అధికారంలోకి రావడానికి తెలుగు యువత కృషి అనిర్వచనీయమని, తెలుగు యువత మండలాధ్యక్షుడు దుర్గారాజు తన వంతు కృషి చేశారని, అటువంటి వ్యక్తి జన్మదిన వేడుకలు తమ మధ్య జరగడం అభినందనీయమని అన్నారు.

CHANGE OF NAME
KOMMIREDDY SATHYANARAYANA (OLD NAME), S/o. SUBBARAO, DOOR NO: 8-4-54/1, 16th WARD, JUVVALAPALEM, TADEPALLIGUDEM MANDAL, WEST GODAVARI, Dist - 534102, ANDHRA PRADESH CHANGE MY NAME FROM KOMMI REDDY SATHYANARAYANA (OLD NAME) TO KOMMIREDDY SATYANARAYANA (NEW NAME) HENCE FORTH IAM BEING CALLED AS KOMMIREDDI SATYANARAYANA (NEW NAME) FOR ALL PURPOSES.